క్లుప్తంగా

స్టీల్ ప్లేట్‌లు, గ్లాస్‌లు పంపిణీ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ అధ్యక్షుడు నేరెళ్ల కృష్ణ మోహన్ సహకారంతో అయితా నగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం స్టీల్ ప్లేట్‌లు, గ్లాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, నంబూరి కుమరా, స్కూల్ కరస్పాండెంట్ లతా కుమారి, ప్రధానోపాధ్యాయులు దావలి స్వర్ణలత, కర్రా జాకబ్ ప్రసాద్ పాల్గొన్నారు.

చేనేతల ప్రగతికి ప్రగడ కోటయ్య కృషి



తెనాలి: శ్రీ పద్మశాలియ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో 'చేనేత బంధు' ప్రగడ కోటయ్య 29వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. చినరావూరులోని ప్రగడ కోటయ్యనగర్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు తిరువీధుల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పంచుమర్తి భాస్కరరావు, కోశాధికారి గట్టు బాల శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు దివి హేమంత్ కుమార్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఏపీ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ మాట్లాడుతూ 1952 నుంచి 1990 వరకు ప్రగడ కోటయ్య ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడిగా చేనేత పరిశ్రమకు చేసిన అభివృద్ధిని వివరించారు. పదవులను ఆశపెట్టినా పట్టించుకోకుండా చేనేతల అభ్యున్నతికి ఆయన జీవితాంతం కృషిచేశారన్నారు. గోలి శ్రీనివాసరావు, అక్కల వెంకట శివప్రసాద్, రామనాథం వెంకటకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బొల్లిముంత జయంతి



తెనాలి: ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ 104వ జయంతి మహోత్సవం బుధవారం సాయంత్రం ఆయన స్వస్థలమైన తెనాలిలో జరగనుంది. అభ్యుదయ కళాసమితి, ప్రజా నాట్యమండలి, ఇస్కఫ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో ఏర్పాటయే సభకు పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారు. ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి కాగితాల రాజశేఖర్, నాసా పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు పాల్గొంటారు. డాక్టర్ రంగిశెట్టి రమేష్ నిర్వహణలో సాంస్కృతిక ప్రదర్శనలు, అనంతరం బొల్లిముంత శివరామకృష్ణ రచించిన 'సంభవామి యుగేయుగే' నాటికను ప్రదర్శిస్తారు.

పొలం పిలుస్తోంది..



తెనాలిరూరల్: జగడిగుంటపాలెం, బుర్రిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. లామ్ ఫాం శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు సూచనలు అందించారు. మొక్కజొన్న, జొన్న పంటలో కలుపు యాజమాన్యం, తెగుళ్ల నివారణ గురించి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి రైతులకు వివరించారు. అలాగే మొక్కజొన్నలో గులాబీరంగు కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు, రసం పీల్చు పురుగుల యాజమాన్యం గురించి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దయానా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్సీ ఏవోరాజవంశి, మండల వ్యవసాయాధికారి జి. ప్రేమ్‌సాగర్ , ఏఈవోలు మోహన్, గోపీనాథ్, వీఏఏ నీలవేణి, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అప్రమత్తతతో తప్పిన జంట హత్యలు

తెనాలిరూరల్: పోలీసుల అప్రమత్తంగా వ్యవహరించడంతో జంట హత్యలు జరగకుండా నిరోధించగలిగారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం ఇంటూరుకు చెందిన వ్యక్తితో విభేదాల కారణంగా భార్య విడిపోయి తెనాలిలో మరొకరితో సహజీవనం చేస్తోంది. తన భార్య, ఆమె ప్రియుడిని హతమార్చాలని ఆ మహిళ భర్త కొబ్బరిబొండాలు నరికే కత్తితో మంగళవారం తెనాలి వచ్చాడు. అనుమానాస్పదంగా ఉన్న ఇతడిని త్రీ టౌన్ పోలీసులు బస్టాండ్ సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం తెలిపాడు. కత్తిని స్వాధీన పర్చుకుని అమృతలూరు పోలీసులకు అప్పగించారు.

గడ్డి చుట్టేస్తున్నారు

- హార్వెస్టర్ కోతలతో చిన్న ముక్కలుగా వరి గడ్డి
- ఎండు గడ్డి సేకరణలో రైతులకు ఇబ్బందులు
- పరిష్కారంగా గడ్డి చుట్టే యంత్రాలపై మొగ్గు
- తక్కువ ఖర్చుతో తీరుతున్న గడ్డి కొరత



గడ్డిని మోపులుగా చుడుతున్న యంత్రం



పొలంలో యంత్రంతో చుట్టిన గడ్డి మోపులు

కొల్లిపర: సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు రైతులు యంత్రాలపై అధికంగా ఆధారపడుతున్నారు. కూలి రేట్లు పెరగటంతో వరి కోతలను హార్వెస్టర్ల ద్వారా త్వరగా ముగించేస్తున్నారు. కల్లాం దాటకుండానే ధాన్యాన్ని విక్రయించేస్తున్నారు. ఈ సాంప్రదాయేతర విధానంతో వరి గడ్డి సమస్య పశుపోషకులకు ఉత్పన్నమవుతోంది. హార్వెస్టర్ కోత వల్ల వరి చిన్న చిన్న ముక్కలుగా బయటకు వస్తుంది. దీంతో గడ్డి వామి వేసుకుని, పశువులకు మేత నిల్వ ఉంచుకునే పరిస్థితి లేకుండా పోయింది. వరి చేనులో ముక్కలుగా ఉన్న గడ్డిని సేకరించలేక, సేకరించినా మోపులుగా చేసుకునే వీలు లేక పొలంలోనే తగలబెట్టేస్తున్నారు. అయితే.. ఎండు గడ్డి కొరతను అధిగమించేందుకు రైతులు గడ్డి చుట్టే యంత్రాలను అధికం వినియోగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితమే ఈ యంత్రాలు అందుబాటులోకి వచ్చినా సరైన అవగాహన లేక కొంత మంది రైతులు మాత్రమే వీటిని వినియోగిస్తూ వచ్చారు. కానీ, వ్యవసాయాధికారులు గడ్డి చుట్టే యంత్రాలపై అవగాహన కల్పిస్తున్నారు.

పశుపోషకుల పాట్లు..

యాంత్రిక వరి కోతలతో.. ఎడ్లు గడ్డి లేక పశు పోషణకు పక్కన కృష్ణా జిల్లాలోని ఉయ్యూరు, చాగంటిపాడు, బద్రేచిపాలెం, ఓగిరాల వంటి గ్రామాలకు రైతులు వెళ్తున్నారు. అక్కడ ఎక్కువ శాతం కూలీలు వరి కోతలు కోయడంతో ఎండు గడ్డిని ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. దీనికి రవాణ ఖర్చులు అదనం. ఖర్చులకు తగ్గించుకునేందుకు గడ్డి చుట్టే యంత్రం వారికి ఉపయోగపడుతోంది.

200 యంత్రాలు.. రూ.30ల ఖర్చు

గతేడాది నియోజవర్గంలో సుమారు 50 గడ్డి చుట్టే యంత్రాలు వినియోగిస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య 200కు చేరింది. ఈ యంత్రాలను ట్రాక్టర్లకు అనుసంధానిస్తే.. గడ్డిని పురి కొసలతో మోపులుగా చుట్టేస్తుంది. ఈ మోపులను రైతులు పశువుల పాక వద్దకు చేర్చుకుంటున్నారు. యంత్రంతో ఒక్కో మోపుకు రూ.30 వరకూ ఖర్చువుతోంది. ఎకరానికి 45 నుంచి 55 మోపుల వరకు సేకరించగలుగుతున్నారు. గడ్డి మోపులను పొలం నుంచి పశువుల పాకకు చేర్చేందుకు మరో రూ.30 మోపునకు అవుతోంది. మొత్తమ్మీద ఒక్కో మోపునకు పాడి రైతుకు రూ.60 ఖర్చు కాగా, ఎకరానికి రూ.2,750 నుంచి రూ.3 వేల వరకు అవుతోంది. దాణా ఖర్చులకన్నా ఇది తక్కువే. సేకరించిన గడ్డిని మేటులుగా వేసి, వర్షం పడినపుడు టార్పాలిన్‌తో కాపాడుకోవలసి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



ట్రాక్టర్ ద్వారా గడ్డి తరలింపు

మేలైన గడ్డి ఉండటం లేదు

యంత్రాల వరి కోతలతో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది. ఇప్పుడు ఎరువుల వాడకం అధికం కావడంతో గతంలో మాదిరి మేలైన గడ్డి రావడం లేదు. హార్వెస్టర్‌తో వరి కోత ఖర్చు తగ్గించినా.. గడ్డి ఎక్కువగా వృథా అవుతోంది.

-ఈమని సాంబిరెడ్డి, తూములూరు, పాడి రైతు

గడ్డిని తగలబెట్టొద్దు..

యంత్రాలతో కోతలు కోసిన వరి చేనులో వ్యర్థాలను తగల బెడుతున్నారు. దీని వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. గడ్డిని పోగు చేసి లేదా పనలపై ఉప్పు చల్లి మాగబెడితే పశువులు ఇష్టంగా తింటాయి. పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి.

- ఉషారాణి, ఏడీఏ, తెనాలి

నగర సంకీర్తనలు

తెనాలి: కార్తిక మాసం సందర్భంగా కొలకలూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో భక్తులు ప్రతి రోజూ తెల్లవారు జామున నగర సంకీర్తనలు చేస్తున్నారు. మంగళవారం గ్రామానికి చెందిన మద్దుకూరి సాంబయ్య గృహంలో ప్రత్యేక పూజలను అర్చకుడు తులాబందుల సాంబశివరావు నిర్వహించారు. భక్తులకు ఆశీర్వచనాలను అందజేశారు. మలిశెట్టి శ్రీనివాస్, తోట నాగేశ్వరరావు, తులాబందుల చిట్టిబాబు, గద్దె బుల్లెబ్బాయి, తాళ్లూరి సుబ్బులమ్మ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ వన సమారాధన



తెనాలి: పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన మంగళవారం నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని పర్వతవర్ధని సమేత శ్రీరామేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సంఘీయులు పలువురు పాల్గొన్నారు. నాయీ బ్రాహ్మణ ప్రముఖులు డెప్యూటీ కలెక్టర్ మునుగోటి శ్రీనివాసరావు, విశ్రాంత జేఈ ఆర్.సురేంద్రబాబు, ఆరోగ్య విభాగం కె.నాంచారయ్య, కళాకారులు తంగెళ్లమూడి సాయిబాబు, తాడికొండ నరసింహారావును సత్కరించారు. కమిటీ బాధ్యులు కొడాలి సుబ్రహ్మణ్యం, చందర్లపాటి సూర్యవెంకటేష్, గండికోట రాజారమేష్, లింగాల కోటేశ్వరరావు, శివలింగప్రసాద్ పర్యవేక్షించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

- ఇన్‌చార్జి జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ మజీదా బేగం
- తెనాలి జిల్లా వైద్యశాలలో ఆరోపణలపై విచారణ



విచారణ జరుపుతున్న జిల్లా కో–ఆర్డినేటర్

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో సేవలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, పునరావృతం కాకుండా చూసుకోవాలని సెకండరీ హెల్త్ విభాగ ఇన్‌చార్జి జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ మజీదా బేగం హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా వైద్యశాల సేవలపై రెండు ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ జరిపేందుకు ఆమె తెనాలి మంగళవారం వచ్చారు. నందివెలుగుకు చెందిన షబీనా బేగం ప్రసవం నిమిత్తం వైద్యశాలకు వెళ్తే అక్కడున్న ఉద్యోగులు ఫైల్ విసిరేసి గుంటూరు వెళ్లాలని సూచించారని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు సబ్ కలెక్టర్ సంజనా సింహకు ఫిర్యాదు చేశారు. అలాగే దుగ్గిరాల మండలం చింతలపూడికి చెందిన శివాజీకి తన సోదరితో వివాదం జరిగి ఇద్దరు గాయపడి జిల్లా వైద్యశాలకు వచ్చారు. అక్కడ తనను ఆస్పత్రిలో చేర్చుకోకుండా తనపై దాడి చేసిన వారిని చేర్చుకున్నారని, అక్కడున్న వైద్యులు స్వార్థపూరితంగా వ్యవహరించారని శివాజీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదులపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులు ఆదేశించటంతో డాక్టర్ మజీదా బేగం ఫిర్యాదు దారులను పిలిపించారు. వైద్యులు, సిబ్బంది సమక్షంలో వారు చేసిన ఆరోపణలపై విచారణ జరిపారు. కమ్యునికేషన్ గ్యాప్ వల్ల ఇవి జరిగాయని, సిబ్బంది పనితీరులో మార్పురావాలని స్పష్టం చేశారు. రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించడం జరిగిందని ఆమె తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



బుర్రిపాలెం వైపు రోడ్డును కమ్మేసిన పొగ



ఆకాశంలో మేఘాలను తలపిస్తున్న దట్టమైన పొగ

కంపోస్టు 'కాష్టం'తో ఉక్కిరిబిక్కిరి

తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ కంపోస్టు యార్డులో కొండల్లా పేరుకు పోయిన చెత్త ఎప్పుడు, ఎందుకు తగలబడుతుందో తెలీదు. తరచూ అక్కడ్నుంచి వచ్చే పొగ సృష్టించే సమస్య అంతా ఇంతా కాదు. మంగళవారం మధ్యాహ్నం ఇక్కడి నుంచి వెలువడిన గోధుమ వర్ణంలోని దట్టమైన పొగ మేఘాలను తలపించాయి. కనీసం అర కిలోమీటరు పరిధిలోని ప్రజలను అవస్థపెట్టాయి. రోడ్డంతా కమ్మేసిన పొగతో వాహనదారులు ఊపిరి సలపక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆటోలు, ఇతర వాహనాలు పట్టపగలు లైట్లు వేసుకుని ప్రయాణించాయి. కొన్ని గంటలపాటు ఈ దురావస్థ తప్పలేదు. కంపోస్టు యార్డును అక్కణ్ణుంచి తరలించమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించినా అమలు కాలేదు. కనీసం తరచూ పొగ బారినుంచైనా రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

– తెనాలి

రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

- రాజ్యాంగ ఆమోద దినోత్సవం
- అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు ఘన నివాళులు

తెనాలి అర్బన్: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రజా ప్రతినిధుల కార్యాలయాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ గొప్పదనాన్ని, విశిష్టతను పలువురు వివరించారు.

తెనాలి: ప్రపంచంలోనే అది పెద్ద భారత రాజ్యాంగాన్ని రచించిన 'భారతరత్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ ఘన నివాళులర్పించారు. రాజ్యాంగంపై విధేయత, రాజ్యాంగ స్ఫూర్తిని కలిగి ఉండాలని సూచించారు. స్థానిక రైల్వేస్టేషను వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని గత ప్రభుత్వం రాజ్యాంగానికి లోబడి, విలువలకు కట్టుబడి అన్ని వర్గాల హక్కులని కాపాడుతూ రాజ్యాంగ ఫలాలను అందించినట్లు గుర్తుచేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, మాజీ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు గడవర్తి సాయి హరేరామ్, యాతాటి అనిల్, కో–ఆప్షన్ సభ్యులు బచ్చనబోయిన శ్రీనివాసరావు, పెచ్చింగ్ సుభాని, మాజీ సర్పంచ్ శివనాగేశ్వరరావు, పార్టీ నాయకులు కఠారి హరీష్, గోల్డ్ రహీమ, కె. దేవానంద్, కాకి దేవసహాయం, కొమ్ము రాయల్, కొడాలి క్రాంతి, యలవర్తి సాంబశివరావు, పినపాటి అనిల్, కనపర్తి అనిల్, కాళిదాసు సత్యం, కాళిదాసు వెంకటేశ్వరరావు కోలా వాసు, అక్కిదాసు కిరణ్ కుమార్, మహమ్మద్ గౌస్, టిక్స్ బాల, పిల్లి వీరయ్య, ఏ సీమోను పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన చైర్‌పర్సన్ రాధిక

■ రాజ్యాంగ స్ఫూర్తితో అందరు పనిచేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆమె పూల మాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, మేనేజర్ దేవసేన, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

■ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ కుమార్, కౌన్సిలర్ యాతాటి అనిల్, నాయకులు కుర్రా జశ్వంత్, సయ్యద్ గౌస్, కొమ్ము రాయల్, కనపర్తి అనిల్, ప్రసాదం సురేష్, బడుగు రమేష్, తాడిగిరి శరత్ బాబు, నాగూల్ పాల్గొన్నారు.

■ కొల్లిపర: ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించి, రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకోవాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి అన్నారు. తన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. సిబ్బందికి రాజ్యాంగ పీఠిక చదివి వినిపించారు. ఈవోపీఆర్డీ భార్గవ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

■ తెనాలి రూరల్: స్వేచ్ఛ, సమానత్వం అందిస్తున్న రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని న్యాయమూర్తులు ఎం.శ్రీధర్, షేక్ అబ్దుల్ షరీఫ్ పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్ట్ సివిల్ కోర్ట్ ఆవరణలో రాజ్యాంగ పీఠికను న్యాయమూర్తులు, సిబ్బంది చదివారు. ప్రతిజ్ఞ చేయించారు. కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

■ మున్నంగి(కొల్లిపర): మున్నంగి ప్రాథమిక పాఠశాల(ఆర్)లో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజ్యాంగ రూప కల్పనకు కృషి చేసిన మహనీయులు చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. హెచ్ఎం ఎం.రాము, ఉపాధ్యాయులు సోమరౌతు లక్ష్మీ కమల ఉన్నారు.

– తెనాలి: స్థానిక విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఏఏవోలు లీలావతి, ఆనంద్, యూడీసీ హరికృష్ణ, వేజెండ్ల రమేష్, కంభం నాగేశ్వరరావు, చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది పూలమాల వేసి, నివాళులర్పించారు.

■ తెనాలి: డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బోసు రోడ్డులోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ శేషిరెడ్డి అధ్యక్షత వహించారు. విశ్రాంత బ్యాంక్ మేనేజరు చిట్టూరి సీతారామయ్య, కనపర్తి సింగయ్య, ఆర్అండ్‌బీ రాజు, దీపాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. డాక్టర్ శేషిరెడ్డి పేద కళాకారులు కొండలరావు, నారాయణ, భాస్కర్, ప్రసాద్, పొట్టి ప్రసాద్‌బాబు, కుర్రా ప్రసాద్, శేఖర్, యాకోబు, యోహాను, చలమయ్య, శివపార్వతి, జ్యోతికి నూతన వస్త్రాలను బహూకరించారు. స్టాలిన్, బైరాగి, మల్లేశ్వరరావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి, సచివాలయం సిబ్బంది



ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయమూర్తులు శ్రీధర్, అబ్దుల్ షరీఫ్

మరీ ఇంత అధ్వానమా..!

చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: 'మురుగు కాల్వలను మరీ ఇంత అధ్వానంగా ఉంచుతారా..? ప్రతిరోజు వీటిని బాగు చేయరా..?' అంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని 27వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. కాల్వల్లోని వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే వార్డు ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పనితీరు మార్చుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ బోయపాటి అరుణ, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, టీపీవో సాంబశివరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



ఉద్యోగులకు సూచనలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్

తెనాలి: భారతదేశ పాడి పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మహనీయుడు 'పద్మభూషణ్' డాక్టర్ వర్గీస్ కురియన్ అని పశు సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఒ.నరసింహారావు అన్నారు. పాల ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉండటానికి ఆయన ప్రారంభించిన 'పాల వెల్లువ' ప్రధాన కారణమన్నారు. జాతీయ పాల దినోత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఇక్కడి బుర్రిపాలెం రోడ్డులోని గ్రామీణ పశు వైద్యశాలలో ఘనంగా నిర్వహించారు. పాల ఉత్పత్తి పెరిగేందుకు దోహదపడిన వర్గీస్ కురియన్ 'శ్వేత విప్లవ పితామహుడు'గా చెప్పారు. ఆయన జన్మదినం నవంబరు 26న దేశ వ్యాప్తంగా జాతీయ పాల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. సంచార పశువైద్యశాల వైద్యుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, డాక్టర్ ఎల్. నాగేశ్వరరావు, బహుళార్థక పశు వైద్యశాల, గుంటూరు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. తొలుత డాక్టర్ కురియన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



కురియన్ చిత్రపటానికి నివాళి

తెనాలిరూరల్: ముత్తెంశెట్టి పాలెంలోని అంబేడ్కర్ విగ్రహానికి తెనాలి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగ సూర్య శశిధరరావు , గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధారా రామకృష్ణ, మండలాధ్యక్షుడు కర్లపూడి బుల్లియ్య, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురప్ప ద్వారకా శ్రీనివాస్ పాల్గొన్నారు.